కథ

# ఆనందరావు - అద్దం

అభిమన్యు



వేసవికాలం. సమయం పది. సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు.

ఆనందరావు 'కాలు కాలిన పిల్లి'లా ఇంట్లోకి, బయటికి తిరుగుతున్నాడు.

"అలా తిరిగే బదులు ఇలా వచ్చి ఈ దొండకాయలు తరగొచ్చుకదండీ...!" అని వంటింట్లోంచి భార్య రత్నమాల కేక వేసింది.

"అబ్బా! ఉండవే.. నా టెన్షన్‌లో నేనుంటే మధ్యలో నీ నస ఒకటి..." అని విసుక్కున్నాడు ఆనందరావు.

ఆనందరావు ఊరు చివర కొత్తగా కట్టిన ఇంట్లోకి అద్దెకి దిగాడు. ఆ ఇంటికి ఎదురుగా నున్న ఖాళీ స్థలంలో కొంతమంది కుర్రాళ్ళు క్రికెట్ ఆడుతున్నారు.

రత్నమాల ఎంత వద్దన్నా వినకుండా ఆనందరావు నిలువుటద్దంకి ఆర్డరిచ్చాడు. ఆ షాపువాడు ఆ రోజు ఇంటికి పంపిస్తానన్నాడు. అందుకు ఆనందరావు ఆతృతగా తిరుగుతున్నాడు.

ఆనందరావుకి 43 సంవత్సరాలు. హిందీ మాష్టారుగా ఓ హైస్కూల్‌లో చేస్తున్నాడు.

ఆనందరావుకి తన పర్సనాలిటీ మీద చాలా కాన్ఫిడెన్స్, కాస్త పొడవు, పొడవుకు తగ్గ ఒళ్ళుతో చూడ్డానికి బాగుంటాడు.

ఆనందరావు తన పర్సనాలిటీని చూసుకొని ఉద్యోగానికి ఎగనామం పెట్టి సినిమా వోళ చుట్టూ కొన్నాళ్ళు, ఆ తర్వాత టి.వి. వాళ్ళ చుట్టూ తిరిగాడు వేషాల కోసం... అయినా ఫలితం కనిపించలేదు. చేతిలో డబ్బులు అయిపోయాయి. అప్పులు మిగిలాయి.



చెప్పా చేయకుండా ఉద్యోగానికి ఎగనామం పెట్టి తిరుగుతున్న ఆనందరావుకి ఉద్యోగం ఊడిపోయే ప్రమాదం ఏర్పడింది. అంతేకాదు ఆనందరావు భార్య అయిన రత్నమాల కూడా ఇతగాడి పనులకి చిరాకు కలిగి అటు ఉద్యోగాన్ని ఇటు భార్యను వదిలి దేశదిమ్మరిలా తిరుగుతున్న ఆనందరావుని వదిలి పుట్టింటికి వెళ్ళిపోయింది.

రత్నమాల ఇచ్చే 'షాక్'కి కరెంట్ షాక్ తగిలిన 'కాకి'లా గిలగిల లాడి, బుద్ధి తెచ్చుకొని అటు ఉద్యోగం, ఇటు సంసారం చక్కగా చేసుకోసాగాడు.

చిన్నప్పటినుంచీ ఆనందరావు చదువుకి డుమ్మా కొట్టి అల్లరి చిల్లరిగా తిరిగేవాడు. తత్ఫలితంగా చదువులో వెనుకబడేవాడు.

ఆనందరావు తండ్రి నారాయణరావుకి హిందీ మాష్టారుగా మంచి పేరుంది. ఆయన ఇంటి దగ్గర పిల్లలకి ట్యూషన్సు చెప్పేవాడు. ఆ పిల్లలతో పాటు ఆనందరావుని కూడా కూర్చోబెట్టి చెప్పేవాడు. ఆ రకంగా ఆనందరావుకి హిందీ చదవడం, రాయడం వచ్చింది.

నారాయణరావు స్కూల్లో పాఠాలు చెప్పుతుండగా గుండెపోటు వచ్చి చనిపోయాడు. తర్వాత స్కూలు వాళ్ళు ఆనందరావుని హిందీ మాష్టార్‌గా తాత్కాలికంగా నియమించారు.

తర్వాత... తర్వాత ఆనందరావు అవసరమైన హిందీ పరీక్షలు రాసి, ట్రైనింగ్‌కి వెళ్ళి అదే స్కూల్లో హిందీ మాస్టారుగా సెటిల్ అయిపోయాడు.

నిజానికి ఆనందరావు ఆర్థిక పరిస్థితి అంతంతే. అయినా తన పర్సనాలిటీ మీద ఓవర్ కాన్ఫిడెన్స్‌తో ఏ డబ్బున్న అమ్మాయినైనా ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనే తపనతో నలుగురైదుగురు అమ్మాయిలకు సైట్‌కొట్టి, బీటు వేసి భంగపాటు చెందాడు.

చివరికి విసిగి, వేసారి గత్యంతరం లేక మేనమామ కూతురు రత్నమాలని పెళ్ళి చేసుకున్నాడు.

ఆనందరావుకి చిరకాలంగా ఒక కోరిక ఉండేది.. అది "అందమైన తన దేహాన్ని అద్దంలో చూసుకొని మురిసిపోవాలని..."

ఆనందరావు భార్య రత్నమాల 'సారె' కింద మంచం, బీరువా, డ్రెసింగ్ టేబుల్ వగైరా... వగైరాలు తెచ్చింది. అయితే డ్రెస్సింగ్ టేబుల్ అద్దం గుండ్రంగా చిన్నగా ఉంది. అందులో చూసుకుంటే భుజాల వరకే కనిపిస్తుంది.

"ఏం? నిలువటద్దం తెస్తే నీ బాబు సొమ్ము ఏమైనా తరిగిపోతాదా...!?" అని రత్నమాల మీద చిరాకు పడ్డాడు ఆనందరావు.

ఒకసారి రత్నమాలతో కలిసి బట్టలషాపుకి వెళ్ళాడు ఆనందరావు. రత్నమాల చీరలు చూస్తుంటే ఆనందరావు తనకు అవసరం లేకపోయినా ఒక ప్యాంటు తీసుకొని 'ట్రయల్ రూమ్'లోకి వెళ్ళాడు. లోపల ఆనందరావు షర్ట్, ప్యాంటు విప్పేసాడు. ఇంక ఒంటిమీద డ్రాయరు మాత్రమే ఉంది. అది కూడా తీసేయబోతుంటే కరెంటుపోయింది. ఈలోగా తలుపుమీద 'దబదబ'మని చప్పుడైంది. ఆనందరావు కంగారుగా డోర్ తెరిచాడు. ఒక వ్యక్తి ఆనందరావుని జబ్బ పట్టుకొని బయటకి లాగి, "అడ్డులేవయ్యా మగడా! ఆ వెనకాతల జనరేటర్ ఉంది, వెయ్యాలి..." అని ఆ రూములోకి దూరాడు.

ఈలోగా కరెంటు వచ్చింది. ఆనందరావు వాలకం చూసి షాపులోని వారందరూ 'పకపక'మని నవ్వసాగారు. ఆనందరావు ఒంటిమీద డ్రాయరు తప్పా మరేవీ లేవు. అక్కడ రత్నమాలకి తల కొట్టేసినంత పనైంది.

ఇంకోసారి బంధువుల పెళ్ళికి వెళ్ళారు ఆనందరావు, రత్నమాల. కళ్యాణమండపంలో పెళ్ళి జరుగుతోంది. మధ్యలో ఆనందరావుకి బాత్రూమ్ అవసరం ఏర్పడింది. బాత్రూమ్ కోసం ఎంక్వయిరీ చేస్తే ఒక గది వైపు చూపించారు. ఆ గది తలుపులు దగ్గరికి వేసి ఉన్నాయి. ఆనందరావు ఆ గది తలుపులు తెరుచుకొని లోపలికి వెళ్ళాడు. అది ఆడపెళ్ళివారి గది, అటాచ్డ్ బాత్రూమ్. ఆ గది నిండా పెళ్ళి వారి వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. ఆ గదిలో ఓ పక్కగా డ్రెస్సింగ్ టేబుల్ ఉంది. దాని మీద ఆనందరావు దృష్టి పడింది. అతను బాత్రూమ్ విషయం మరిచిపోయి తలుపులు దగ్గరికి వేసాడు. ఆనందంతో డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరికి వెళ్ళి షర్ట్, ప్యాంటు విప్పేసాడు. అద్దంలో తన దేహాన్ని చూసుకొని మురిసిపోసాగాడు. మరో నిమిషంలో డ్రాయరు కూడా విప్పేసేవాడే. అయితే ఈలోగా ఎవరో అమ్మాయి ఏదో అవసరమై ఆ గదిలోకి వచ్చి, అర్ధ నగ్నంగా ఉన్న ఆనందరావుని చూసి భయంతో 'కెవ్వు'మని కేక వేసింది. ఆ 'కేక'కు ఓ నలుగురైదుగురు రూమ్‌లోకి రావడం... ఆ వచ్చినవాళ్ళు ఆనందరావు అర్ధ నగ్న దేహాన్ని చూసి చితకబాదడం నిమిషాల్లో జరిగిపోయింది.

**శరీరం మనది. ఈ శరీరంలోని అవయవాలు మనవి. మరి మన ఈ శరీరాన్ని పూర్తిగా చూసుకోవడంలో తప్పేముంది...!? నిజానికి శరీరంలోని చాలా భాగాన్ని దుస్తులతో కప్పేస్తున్నాం కనీసం అప్పుడప్పుడైనా నగ్నంగా చూసుకోకపోతే ఎలా...!?**

ఈ రకంగా ఎన్ని అవమానాల పాలైనా ఆనందరావు కోరిక మాత్రం తీరడం లేదు.

సమయం పన్నెండు అయ్యింది.

ఇద్దరు వ్యక్తులు రిక్షాలో నిలువుటద్దాన్ని తీసుకువచ్చారు. దానికి పాత న్యూస్ పేపర్లు చుట్టి ఉన్నాయి.

ఆనందరావు వారికి ఎదురెళ్ళి సాయం పట్టాడు. ఆ అద్దాన్ని వీధి గుమ్మంలో పెట్టి, బాడుగ అడిగి తీసుకొని వెళ్ళిపోయారు.

ఆనందరావు ఆనందంగా ఆ అద్దానికి చుట్టి ఉన్న పేపర్లు తీసేసాడు. ఆ అద్దం ఆరు అడుగుల పొడవు, అడుగున్నర వెడల్పుతో 'తళ తళ'మని మెరిసిపోతోంది. అద్దంచుట్టూ వుడ్‌తో చక్కగా ఫ్రేమ్ కట్టి ఉంది. అంతేకాదు... దాని అడుగున చక్రాలు కూడా ఉన్నాయి.

"ఆ చక్రాలు దేనికండీ...!?" అమాయకంగా అడిగింది రత్నమాల.

'ఆ మాత్రం తెలీదా...!?' అని అర్థం వచ్చేటట్లు ఆమె వైపు చూసి, చిన్నగా నవ్వి "దీన్ని గదిలో ఎక్కడికి కావాలంటే అక్కడికి జరుపుకోవచ్చు. అలాగే ఏ గదిలోకి కావాలంటే ఆ గదిలో పెట్టుకోవచ్చు..." అన్నాడు.

"ఆс! మనకు పది గదులున్నాయి..." అంది రత్నమాల.

"అలా కాదోయ్! పడక గదిలో, భోజనాల గదిలో అలా మన ఇష్టం..." అన్నాడు ఆనందరావు.

"ఇంకా నయం... బాత్రూమ్‌లో కూడా పెట్టుకోవచ్చు అన్నారు కాదు..." చిరాగ్గా ముఖం పెట్టి అంది రత్నమాల.

"కరెక్ట్... మంచి ఐడియా, స్నానాల గదిలోనూ పెట్టుకోవచ్చు... ఎంచక్కా చూసుకుంటూ స్నానం చేయవచ్చు..."

రత్నమాల ఆనందరావుని ఎగాదిగా చూసి 'ఈయనికి పిచ్చిగాని ఎక్కలేదు గదా' అనుకొని లోపలికి వెళ్ళిపోయింది.

శరీరం మనది. ఈ శరీరంలోని అవయవాలు మనవి. మరి మన ఈ శరీరాన్ని పూర్తిగా చూసుకోవడంలో తప్పేముంది...!? నిజానికి శరీరంలోని చాలా భాగాన్ని దుస్తులతో కప్పేస్తున్నాం. కనీసం అప్పుడప్పుడైనా నగ్నంగా చూసుకోకపోతే ఎలా...!?

ఆనందరావు ఆ నిలువుటద్దాన్ని పడకగదిలోపెట్టి, గది తలుపులు దగ్గరికి వేసి, అద్దం దగ్గరికి వెళ్ళి తనని తాను చూసుకోసాగాడు. అదేదో దిక్కుమాలిన సినిమాలో, ఫస్ట్ నైట్ సీనులో, స్లోమోషన్‌లో హీరోయిన్ గుడ్డలు విడిచినట్లు... ఆనందరావు, ఆనందంతో ఈల వేసుకుంటూ ఒంటిమీద దుస్తుల్ని ఒక్కొక్కటి విప్పసాగాడు.

ఈలోగా రత్నమాల వంట పని ముగించుకొని, దగ్గరికి వేసి ఉన్న పడక గది తలుపులు త్రోసి లోనికి వెళ్ళింది. లోపల అద్దం ముందు నగ్నంగా ఉన్న ఆనందరావుని చూసి భయంతో 'కెవ్వు'మని కేక వేసి పడిపోయింది.

ఆనందరావు అప్పుచేసి నిలువటద్దాన్ని కొని తన ముచ్చట తీర్చుకున్నాడు. ఇప్పుడు ఆనందరావు ఎక్కువసేపు అద్దం దగ్గరే గడుపుతున్నాడు. పడక గదిలో, భోజనాలు చేసిన దగ్గర... ఆఖరికి స్నానాల గదిలోకి కూడా అద్దాన్ని తీసుకు పోతున్నాడు ఆనందరావు.

ఆనందరావు అద్దం పిచ్చి చూస్తుంటే రత్నమాలకి మెంటల్ వచ్చేట్టుగా ఉంది. ఏమైనా అంటే...

"ఈ అద్దం గురించి తప్పుగా మాట్లాడకు కృష్ణుడు మారం చేస్తుంటే ఈ అద్దంలోనే చందమామను చూపించింది వాళ్ళ అమ్మ. అంతెందుకు...!? మీ ఆడవాళ్ళు అన్నం అయినా మానేస్తారుగాని అద్దాన్ని చూడ్డం మానేస్తారా...!?" అని చిన్న సైజు స్పీచ్ ఇచ్చేవాడు ఆనందరావు.

***

ఆరోజు స్కూలు నుంచి ఇంటికి వచ్చిన ఆనందరావు ఎప్పటిలాగానే పడకగదిలోకి వెళ్ళాడు. అక్కడ ఉండవలసిన నిలువుటద్దం లేదు. ఆనందరావులో చిన్న అలజడి ప్రారంభమైంది. రత్నమాలకి కోపం వచ్చి స్టోర్ రూమ్‌లో గాని పడేసిందా అని అనుమానం వచ్చి స్టోర్ రూమ్‌లో చూసాడు. అక్కడా లేదు. కోపంతో వంట గదిలో ఉన్న రత్నమాల దగ్గరికి వచ్చాడు. అక్కడి దృశ్యం చూసి ఆనందరావు ఆశ్చర్యపోయి చూస్తూ ఉండిపోయాడు నోటమాట రాక.

రత్నమాల నిలువుటద్దంలో చూస్తూ వంట చేస్తోంది.

*